కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో ఆనందం

- ఆశాజనకంగా రబీ వరిసాగు
- ఎకరాకు 55 బస్తాల ధాన్యం దిగుబడి
- మెట్ట ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- కొవ్వూరు డివిజన్‌లో 78 కొనుగోలు కేంద్రాలు



గౌరీపట్నం వద్ద రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

దేవరపల్లి: రబీ వరిసాగు ఆశాజనకంగా ఉంది. పంట కోతలు, మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రభుత్వం అండగా నిలబడి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ధాన్యం కొనుగోలున అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

52,800 ఎకరాల్లో సాగు

మెట్ట ప్రాంతంలో వ్యవసాయ బోర్ల కింద రైతులు సాగు చేశారు. నల్లజర్ల మండలం, కొవ్వూరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 52,800 ఎకరాల్లో సాగు జరిగింది. 2022–23 సీజన్‌కు 91355 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం లక్ష్యంగా కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీనికి 3,09,275 గోనె సంచులు అవసరం కాగా, ఇప్పటి వరకు 2,28,392 గోనె సంచులను కొనుగోలు కేంద్రాలకు తరలించింది. గురువారం పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఖరీఫ్‌లో కొనుగోలు కేంద్రాల్లో పంటకు గిట్టుబాటు ధర లభించడం, సకాలంలో చేతికి సొమ్ము రావడంతో రబీలో పండించిన పంటను ఆర్‌బీకేల వద్ద కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు.



మిల్లుకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

ముమ్మరంగా వరికోతలు

వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 15 నుంచి 20 శాతం కోతలు పూర్తికావడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసింది. ఎకరాకు 52 నుంచి 55 బస్తాల దిగుబడి వస్తోంది. ఎండలు ఎక్కువగా ఉండడంతో తేమ శాతం తక్కువ ఉందని రైతులు తెలిపారు. కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి, కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

78 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో 78 కొనుగోలు కేంద్రాను ఏర్పాటు చేశారు. రైతుల ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించడానికి కొనుగోలు కేంద్రాలకు సంబంధించి మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. రైతులకు ఎటువంటి సమస్యలున్నా కంటోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు చేసి ధాన్యాన్ని 45 మిల్లులకు తరలిస్తారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం



కొవ్వూరు డివిజన్ పరిధిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 78 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాం. ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతాన్ని చూసుకుని రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువెళ్లాలి. రైతులకు అవసరమైన గోనే సంచులు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయి. రైతుల సమస్యలు తెలుసుకోవడానికి మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. డివిజన్‌లో 91355 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం నిర్ణయించాం. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలి.

–సి. చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

కొవ్వూరు డివిజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్న గోనెసంచుల వివరాలు..

మండలం	కొనుగో కేంద్రాలు	మిల్లులు	సేకరణ లక్ష్యం(మె, టన్నులు)	గోనెసంచులు
దేవరపల్లి	15	3	15425	34000
నల్లజర్ల	12	2	11922	29500
గోపాలపురం	7	2	8181	22500
తాళ్లపూడి	13	11	16927	58225
చాగల్లు	16	22	15632	65500
కొవ్వూరు	15	5	23268	100000
	78	45	91355	3,09,275

ఎమ్మెల్యే తలారిని కలసిన జక్కంపూడి



ఎమ్మెల్యే తలారితో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ గురువారం దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. గ్రామ, మండల స్థాయిలో యువతను బలోపేతం చేసి, ఉత్సాహాన్ని నింపడానికి మండలాల్లో పర్యటిస్తున్నట్టు జక్కంపూడి గణేష్ తెలిపారు. రాష్ట్రంలో 2024లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరొకసారి సీఎం చేయడానికి యువత కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు అంకురార్పణ

తాళ్లపూడి: గ్రామ దేవత మోదుగులమ్మ తల్లి జాతరకు గురువారం అంకురార్పణ చేశారు. గ్రామ పెద్దలు సమక్షంలో అమ్మవారి చల్లఘటాన్ని పాకలో ఏర్పాటు చేశారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న అమ్మవారి జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నామన పరమేశ్వరరావు, వంబోలు పోశిబాబు, నక్కా చిట్టిబాబు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, సిద్ధంశెట్టి కృష్ణ, జడ్డు శ్రీను, గుండుబోగుల ప్రసాద్, వనిమిరెడ్డి శ్రీను, సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

కొవ్వూరు: పట్టణంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. అగ్ని ప్రమాదాల నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ కేటగిరి వర్గాలకు విస్తృతంగా అవగాహన కల్పించామని అగ్ని మాపక అధికారి కె.రాముడు పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీతో పాటు మాక్ డ్రిల్స్ ద్వారా మంటలు అదుపు చేసే విధానాన్ని ప్రజలకు వివరించారు. ముగింపు సమావేశంలో అవంతీఫీడ్స్ జనరల్ మేనేజర్ డి.రామకృష్ణ, ఎండీ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

23న పుస్తక ప్రదర్శన

నల్లజర్ల : రిటైర్డు తెలుగు ఉపాధ్యాయుడు కూచిబోట్ల రామకృష్ణ వెంకటకృష్ణ ప్రసాద్ తన పీఎఫ్ సొమ్ముతో వివిధ కవుల, రచయితల సాహిత్యాలకు సంబంధించి దాదాపు 60 వేల పుస్తకాలు కొనుగోలు చేశారు. ఆయన మరణానంతరం గత నెల 30న ఆయన 76వ జయంతి సందర్భంగా ఆ పుస్తకాలతో ఆయన ఇంట్లోనే కుటుంబ సభ్యులు జగన్నాథ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. వీటిని ఈనెల 23న నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన కుమారుడు, జగన్నాథ గ్రంథాలయ కార్యదర్శి సోమనాథ్ తెలిపారు. ఇందులో అరుదైన పుస్తకాలతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడేవి ఉన్నాయి.

26న వాహనాల వేలం

కొవ్వూరు: పలు కేసుల్లో పట్టుకున్న తొమ్మిది మోటారుసైకిళ్లకు ఈనెల 26వ తేదీ ఉదయం పది గంటలకు వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్‌తో పాటు రూ.5వేలు ధరవత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు పాట మొత్తం, 18శాతం జీఎస్టీని వెంటనే చెల్లించాలన్నారు. వివరాల కోసం 94409 02430 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నిడదవోలు రూరల్: ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ అన్నారు. విజ్జేశ్వరం సచివాలయం వద్ద ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆధార్‌లో మార్పులు, చేర్పులతో పాటు పలు సేవలను అందించారు. డిజిటల్ అసిస్టెంట్ పి.నవీన్ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి

నిడదవోలు రూరల్: డ్వాక్రా మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ అన్నారు. నిడదవోలులోని చేయూత మహిళా మార్ట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ స్త్రీ నిధి, బ్యాంకు లింకేజ్ పథకాల ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. మహిళలే షేర్ హోల్డర్లగా వ్యవహరించే వెసులుబాటు కల్పించామన్నారు. చేయూత మహిళా మార్ట్‌లు నాణ్యమైన ఉత్పత్తులను హోల్‌సేల్ ధరలకే విక్రయించడంతో పాటు వచ్చిన లాభాలను డ్వాక్రా మహిళలకే అందిస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ సుహాషిణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, మండల సమాఖ్య కార్యదర్శి పాటంశెట్టి ప్రభావతి, ఏపీఎం బి.నాగరాజు, చేయూత మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై ఆర్డీవోకి వినతి



కొవ్వూరులో ఆర్డీవో మల్లిబాబుకి వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏల సంఘం నాయకులు

కొవ్వూరు: అర్హత కలిగిన వీఆర్‌ఏలకు ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులలో నియమించాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బుంగ గణేశ్వరరావు గురువారం ఆర్డీవో ఎస్.మల్లిబాబుకి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 20 వరకూ నైట్ వాచ్‌మెన్,అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్హత కలిగిన వారితో భర్తీకి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. భీమవరం డివిజన్ అధ్యక్షుడు బీవీఏవీ పండు, ఇరగవరం మండల అధ్యక్షుడు ఆవిడ మల్లయ్య, జిలాల ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత

దేవరపల్లి: రంజాన్ సదర్భంగా లక్ష్మీపురంలో జనసేన నాయకులు ముస్లింలకు గురువారం రాత్రి రంజాన్ తోఫా అందజేశారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో తోఫాను అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రైతుల నుంచి ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందని, వారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. యర్నగూడెంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయడానికి రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. దళారులకు అమ్ముకుని మోసపోవద్దని, ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల వద్ద పంటను అమ్ముకుని గిట్టుబాటు ధర పొందాలన్నారు. ధాన్యం అమ్మిన 21 రోజుల్లో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. నియోజకవర్గంలో 34 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కేంద్రాల వద్ద గోనుసంచులు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. మిల్లుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం లారీని ఎమ్మెల్యే వెంకట్రావు జెండా ఊపి పంపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ నరహరిశెట్టి వైదేహి, పామాయిల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు బొంతా చినబాబు, సత్తి జగదీశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.విజయ్, ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, సొసైటీ సీఈఓ మండా పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

వేలం కేంద్రాల్లోనే పండుగుల్ల విక్రయం

రైతులకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు సూచన



ఈడీ శ్రీధర్‌బాబును కలిసి ఎంపీలు ఇచ్చిన లేఖలను అందజేస్తున్న రైతు ప్రతినిధులు

దేవరపల్లి: వేలం కేంద్రాల్లోనే పండుగుల్ల(జిడ్డు) పొగాకు అమ్ముకోవడానికి ఏర్పాటు చేస్తున్నట్టు పొగాకు బోర్డు కార్యనిర్వహణాధికారి అద్దంకి శ్రీధర్ బాబు రైతులకు తెలిపారు. ఆకురెలుపు పూర్తయిన తర్వాత తోటల్లో విడిచిపెడుతున్న పండుగుల్ల పొగాకును వేలం కేంద్రాల్లో కొనుగోలు చేయాలని, బోర్డు అనుమతికి కంటే అదనంగా పండిన పొగాకుకు విధిస్తున్న రుసుంను రద్దు చేసి రైతులను ఆదుకోవాలని పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు రాజమహేంద్రవరం, ఏలూరు పార్లమెంటు సభ్యులు మార్గాని భరత్‌రామ్, కోటగిరి శ్రీధర్‌లను కోరారు. దీనిపై ఎంపీలు వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని బోర్డు చైర్మన్‌కు లేఖలు ఇచ్చారు. లేఖలను గురువారం రైతు సంఘాల ప్రతినిధులు గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబును కలసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈ సీజన్ నుంచి అదనపు పొగాకుపై విధిస్తున్న అపరాధ రుసంను రద్దు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పండుగుల్ల పొగాకును వేలం కేంద్రాల్లో అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఐదు వేలం కేంద్రాలలో ఏదో ఒక కేంద్రంలో పండుగుల్ల పొగాకు విక్రయించడానికి అవకాశం కల్పిస్తామని ఈడీ శ్రీధర్‌బాబు చెప్పారని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు కరుటూరి శ్రీనివాస్, పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు, కాకర్ల నందియ్య, గద్దే శేఖగిరిరావు, పిన్నమని మధుమోహన్ తెలిపారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



ఊనగట్లలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

చాగల్లు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జగనన్నతోనే సాధ్యమని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు అన్నారు. చాగల్లు, చిక్కాల, నందిగంపాడు, మార్కొండపాడు, ఊనగట్ల, దారవరం తదితర గ్రామాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. యా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథుల ప్రభుత్వ పాలనా విధానాన్ని వివరించారు. చాగల్లులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యల్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని అన్నారు.

ఉండ్రాజవరం: గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు సహకారంతో సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేశారు. గ్రామస్తుల అనుమతితో స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో మండల గృహ సారథుల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, వైస్ ఎంపీపీ ఎస్.సరోజిని, రాష్ట్ర కరికాల భక్తుల కార్పొరేషన్ డైరక్టర్ కర్రెళ్ల మంగాదేవి, గంటా వీరన్న, దోడ్డా కోండయ్య, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చిక్కీల తయారీ కేంద్రాల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: మహిళల స్వయం ఉపాధికి కొంతమూరులో ఏర్పాటు చేసుకున్న చిక్కీలు, స్వీట్స్, పచ్చళ్ల తయారీ కేంద్రాలను సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ పరిశీలించారు. చిక్కీల తయారీపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్వీట్స్, హాట్ తయారీ గురించి నిర్వాహకురాలు మాధవిని అడిగారు. యాంత్రీకరణ ద్వారా చేపడితే ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందన్నారు. మరింత వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని మాధవి సీఈఓను కోరింది. డీఆర్‌డీఏ–వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి, డీపీఎం సంపత్‌కుమార్, ఏపీఎం మహేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

స్థల వివాదాన్ని పరిష్కరిస్తాం..

సీటీఆర్ఐ: ఇరువర్గాలు చెప్పిన వివరాలను సేకరించామని, స్థల వివాదాన్ని పరిష్కరిస్తామని సెర్ప్ ముఖ్య కార్యదర్శి నిర్వహణ అధికారి ఎండీ ఇంతియాజ్ అన్నారు. స్థానిక సుబ్బారావు నగర్‌లో స్థల వివాదం పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ అధికారిగా ఇంతియాజ్ గురువారం నగరానికి వచ్చారు. ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న ఇంతియాజ్‌ను జేసీ ఎస్.తేజ్ భరత్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం విచారణ నిమిత్తం సుబ్బారావు నగర్‌లోని వివాద స్థల ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ వివరాలు తీసుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చాగల్లు: చాగల్లులో బస్టాండ్ సెంటర్లో డొక్కా సీతమ్మ జ్ఞాపకార్థం జనసేన పార్టీ నాయకురాలు చెట్టే సుభాషిణి చలివేంద్రం ఏర్పాటు చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పాక విజయ్‌కుమార్, సుంకర సత్తిబాబు, మెరుబండి సురేష్, పట్టపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

తాళ్లపూడి: వార్షిక పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్టు ఎంఈవో కె.వివేకానంద తెలిపారు. మండలంలో జరుగుతున్న ఎస్ఏ–2, క్లాస్‌రూం బేస్‌డ్ ఎసెస్‌మెంట్ పరీక్షలను గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు తెలుగు పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడిలోని మాంటిస్సోరీ హైస్కూల్లో పరీక్షల తీరును ఎంఈఓ పరిశీలించారు. మండలంలోని 36 పరభుత్వ, 14 ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

ఉండ్రాజవరం : పెరవలి, ఉండ్రాజవరం మండల్లాలో మోటార్ సైకిళ్లను దొంగిలించిన నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3 లక్షల విలువ చేసే నాలుగు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రామారావు గురువారం తెలిపారు. గతంలో మండలంలో వేలివెన్ను, తాడిపర్రు, పెరవలి మండలం తీపర్రు గ్రామాల పరిధిలో నాలుగు మోటార్ సైకిళ్ల దొంగతనానికి గురైనట్లు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో రెండు టీంలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించినట్టు తెలిపారు. గురువారం వేలివెన్ను గ్రామానికి చెందిన లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దొంగను పట్టుకోవడానికి సహకరించిన ఎస్సై రామారావు, ఏఎస్సై కె.రామకృష్ణ టీంలను డీఎస్పీ అభినందించారు.

పలకరిస్తూ.. భరోసా కల్పిస్తూ..

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గురువారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పలువురు మాతృమూర్తులు కన్నీటి పర్యంతం అవుతూ తమ గుండెల్లోని ఆవేదనను ఆయనకు మొరపెట్టుకున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. కొండంత ధైర్యాన్ని ఇవ్వడంతో ఆ మాతృమూర్తుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. తమ కుమారుడికి ఏడాది కిందటే వివాహమైందని, పది నెలలుగా కనిపించడం లేదని జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ మహిళ వివరించింది. తుని దగ్గర శరభవరం సమీపంలో కాలువ వద్ద తమ అబ్బాయి సెల్, బైక్ కనిపించాయని తుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆమె రోదించింది. ఆమెను ఎంపీ ఓదార్చి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిడదవోలుకు చెందిన ఓ ఆర్మీ పోలీసు కుమారుడితో తమ కుమార్తెకు వివాహం చేస్తే.. కాపురం చేయనని అంటున్నాడని స్థానిక ఆవ రోడ్డు వాంబే కాలనీకి చెందిన ఓ మాతృమూర్తి ఎంపీ వద్ద బోరున విలపించింది. రాజమహేంద్రవరం దిశ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ తల్లి తెలిపింది. వెంటనే సీఐకు ఫోన్ చేసి ఈ కేసును సీరియస్‌గా తీసుకోమని ఎంపీ భరత్‌రామ్ సూచించారు. ఎంపీ సమస్యలు సాధ్యమైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్నింటిని సంబంధిత అధికారుల దృష్టికి పరిశీలన నిమిత్తం పంపారు.

ఎల్ఐసీ చలివేంద్రం ప్రారంభం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక మోరంపూడి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్ఐసీ ఉద్యోగులు, స్వర్ణాంధ్ర సేవా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మేనేజర్లు ఎ.నాగేంద్రకుమార్, బీఎస్ఎన్ మూర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



కొవ్వూరులో ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోమ్ మంత్రి తానేటి వనిత

- హోమ్ మంత్రి తానేటి వనిత
- 18వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొవ్వూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలో 18వ వార్డులో గురువారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి అండదండగా ఉండాలని కోరారు. పేదలకు మేలు చేసే ఈ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, లీగల్ సెల్ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, వార్డు ఇన్‌చార్జి గంధం శేష సాయి, బత్తి నాగరాజు,అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అందరం అండగా నిలబడదాం

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- జగనన్న కాలనీ సందర్శనం




పాలంగి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: లబ్ధిదారుల సొంతింటి కలను నిజం చేస్తున్న సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పాలంగి గ్రామంలో జగనన్న కాలనీని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అనుకూలంగా జగనన్న కాలనీ లేఅవుట్‌ను మట్టితో మెరక చేయించి, వారికి కేటాయించిన స్థలాలకు నెంబరింగ్ వేయించి అప్పగించామన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ అందిస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరగా తమ ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, పాలాటి శరత్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కఠారి సిద్ధార్ధరాజు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, తహసీల్దార్ జి.కనకరాజు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, విద్యుత్ ఏఈ దొరబాబు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

నిడదవోలు రూరల్: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఫేజ్–2లో మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు సూచించారు. తాడిమళ్ల గ్రామంలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లను గురువారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పరిశీలించి, లబ్ధిదారుతో మాట్లాడారు. తాడిమళ్లలో 223 మందికి ఇళ్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గోదావరి స్నానాల రేవు చదును



తాళ్లపూడిలోని గోదావరి స్నానాల రేవును శుభ్రం చేసిన దృశ్యం

తాళ్లపూడి: ఆర్ఎస్ఎస్ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని గోదావరి పుష్కరాల రేవును గురువారం శుభ్రం చేశారు. ఇక్కడ స్నానాలు చేసేందుకు వీలు రేవులో అస్తవ్యస్తంగా ఉన్న రాళ్లను, మట్టి దిబ్బలను తొలగించి చదును చేశారు. ఈ పనులన్నీ బొర్రా శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. అధికారులు కూడా స్పందించి మరింత అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చంద్రబాబు పుట్టిన రోజునా వేరు కుంపట్లే

కొవ్వూరు: టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో రెండు గ్రూపులు వేర్వేరుగా నిర్వహించారు. పట్టణ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం టాక్సీ స్టాండ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ద్వి సభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, కస్టర్ ఇన్‌చార్జ్‌లు మరపట్ల కళాధర చక్రవర్తి, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ అనుచరులు చంద్రబాబు పుట్టిన రోజును ప్రత్యేకంగా నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బూరుగుపల్లి వీర్రాఘవులు, వేగి చిన్న, నాయకులు కోడూరి ప్రసాద్, పాలగుడుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.